# సూర్య

కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,30 జనవరి 2024




# జల జీవన్ మిషన్ పనుల్లో అవకతవకలు




**- ఐటీడీఏ పీవోకు గిరిజనులు ఫిర్యాదు**

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మండలంలో జల జీవన్ మిషన్ పనుల్లో అవకతవకలు జరిగాయని రంపచోడవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కారం సురేష్ బాబు ఆరోపించారు. సంబంధిత అధికారులు అవకతవకలకు పాల్పడం వల్ల జల జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికి కుళాయి నీరు అందడం లేదన్నారు. దీనిపై రంపచోడవరం ఐటీడీఏ గ్రీవెన్స్ కార్యక్రమంలో సోమవారం గిరిజనులు పీఓ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కారం సురేష్ బాబు మాట్లాడుతూ రంపచోడవరం మండలం పెద్ద గెద్దాడ పంచాయతీ చెరువుపాలెం గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. అయితే కొన్ని ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చి, గ్రామంలో మరికొన్ని ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇవ్వకపోవడం సంబంధిత అధికారుల లోపమా లేక అధికారులు చేతివాటమా అని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో అందించాలని ఐటీడీఏ గ్రీవెన్స్‌లో పిఓ కు తెలుగుదేశం పార్టీ నాయకులు కారం సురేష్ బాబు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సంబంధిత అధికారిని పిలిచి చెరువుపాలెం గ్రామానికి వెళ్లి సమస్య పరిష్కరించాలని ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు వంతల అచ్చయమ్మ, అన్నిక అప్పారావు, కాకర అబ్బులు, కాకర రాజబాబు, నేరం శేఖర్, వసికోన రమణ కుమార్, అన్నిక దుర్గారావు, కత్తుల కొమ్మిరెడ్డి, తుంబుడు రామకృష్ణారెడ్డి, కత్తుల కొమ్మిరెడ్డి, కాకర ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# కోటిఫలి.. నేడు కోటిపల్లి

- మహా శివరాత్రికి ముస్తాబు
- శ్రీశైలం లింగాన్ని పోలివుండే శివుడు
- 365 రోజులూ నీటిలో వుండే మరో శివలింగం
- దేశంలో ఎక్కడా కనపడని అద్భుతం













**కాకినాడ,మేజర్‌న్యూస్ :** సాధారణంగా భక్తులకు అందుబాటులో ఉన్న ఆలయాలకు వెళ్ళరు. సుదూర ప్రాంతాలలో ఉన్న ఆలయాలకు వెళతారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నన్ని మహిమాన్విత స్వయంభు ఆలయాలు దేశంలో మరెక్కడా కనపడవు.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కోటిపల్లి. వాస్తవానికి ఈ గ్రామం పేరు కోటిఫలి. ఇక్కడ వెలిసిన శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత సోమేశ్వర స్వామిని దర్శించుకుంటే కోటి ఫలాలు ఇస్తాడని పేరు. అందుకే ఈ గ్రామానికి కోటిఫలి అనే పేరు వచ్చింది. వాడుక భాషలో ఇది కోటిపల్లి అయిపోయింది. దేశంలో మరెక్కడా లేని విధంగా స్వయంగా ఇంద్రుడు ప్రతిష్ఠించిన లింగం ఇక్కడ దర్శనమిస్తుంది. ఇంద్రుడు ప్రతిష్ట చేసి అభిషేకం చేసాడు. దీంతో 365 రోజులూ ఈ శివలింగం నీటిలోనే కనబడుతుంది. ఆయనే కోటీశ్వరస్వామి. ఆలయానికి వెనుక భాగంలో ఈ అద్భుతం గోచరిస్తుంది. ప్రపంచంలో మరెక్కడా ఇలాంటి అద్భుతంఉండదు. ఇక కోటి ఫలాలు ఇచ్చే సోమేశ్వరస్వామి, రాజరాజేశ్వరి దేవితో కొలువుదీరారు. ఈయననుచంద్రుడు ప్రతిష్టిం చాడు అని చెబుతారు. ఇదే ప్రాంగణంలో మరో ఆలయం ఉంది. నవ జనార్ధనాలయాలలో ఇది ఓఆలయం. శ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి.స్వామి ఎదురుగా నిలబడి స్వామిని ఆపాదమస్తకం తిలకించి న్యాయ బద్ధమైన కోరిక కోరుకుంటే వెంటనే నెరవేరుతుందని భక్తుల నమ్మకం . ఇక చంద్రప్రతిష్ట కాబడిన సోమేశ్వరుడు అచ్చం శ్రీశైలంలో పరమేశ్వరుడు ఎలా ఉంటాడో ఇక్కడ అలాగే గోచరిస్తాడు. అంతే పరిమాణంలో ఉంటాడు. అత్యంత మహిమాన్వితుడు. స్వామిని దర్శించిన వెంటనే కోటి ఫలాలు లభిస్తాయి. ప్రతి హిందువు తన జన్మలో ఒక్కసారైనా చూసితరించాల్సిన ఆలయం. ఇతర ఆలయాలలో ఎక్కడా లేని విధంగా ఈ ఆలయ ప్రాకారంపై సప్త మహర్షులు కొలువు దీరారు. సామర్లకోట, ద్రాక్షారామంలో మాత్రమే కనబడే ఆలయ నమూనా ఆలయంకూడా ఈ ఆలయంలో ఉంటుంది.అంతటి మహిమాన్వితమైన కోటిపల్లిలో మహాశివరాత్రి అంటే మామూలు విషయం కాదు. జన్మకో శివరాత్రి అంటారు. అదేవిధంగా జన్మలో ఒక్కసారైనా చూడాల్సిన శైవక్షేత్రం కోటిఫలి. నిజంగా కోటి మంది భక్తులు వచ్చారా అన్న చందంగా లక్షల్లో భక్తులు మహాశివరాత్రికి తరలివస్తారు. వేకువఝాము నుంచి మరునాటి వేకువఝాము వరకు 24 గంటలూ భక్తులు దర్శనం కోసం బారులు తీరుతారు. దీంతో మహాశివరాత్రికి ఆలయాన్ని ముస్తాబుచేస్తున్నారు.ఆలయ కార్య నిర్వహణాధికారి ఎం.శ్రీదేవి, ఆలయ అర్చకులు బాలు నేతృత్వంలో భారీ ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. సాధారణ రోజుల్లో కూడా ఈ ఆలయానికి వెళితే అక్కడ అర్చకులు బాలు, ఈవో శ్రీదేవి ఆలయ చరిత్రను ప్రతి ఒక్కరికి చెబుతారు. సోమేశ్వరస్వామి, జనార్ధనస్వామి, కోటీశ్వర స్వామి ఈ ముగ్గురి గురించి వారికి వివరిస్తారు. అదేవిధంగా పక్కనే దీపాలు పెట్టుకునే వెసులుబాటు ఉంది.ఆ దీప మహిమ గురించి కూడా వారు వెల్లడిస్తారు. ఇక్కడ 365 ఒత్తులతో ఉన్న దీపాలను కేవలం 20రూపాయలకే విక్రయిస్తారు. అదే ఇతర ఆలయాలలో అయితే 50 నుంచి వంద రూపాయలు వసూలు చేస్తారు. నిజంగా ఆలయ ప్రాంగణంలో అడుగిడగానే ఆధ్యాత్మిక భావాలు వెల్లివిరుస్తాయి. ఆలయం ఎదురుగా కోనేరు. కోనేరులో అతిపెద్ద పరమేశ్వరుడు కూర్చున్న విగ్రహం. నిజంగా ఈ గ్రామస్తులు అదృష్టం చేసుకున్నారా, అందుకే కోటీశ్వరుడు, సోమేశ్వరుడు, జనార్ధనుడు ఇక్కడ కొలువుదీరారా అన్నట్టుగా శివభక్తులు భావిస్తారు. మహాశివరాత్రి సందర్భంగాపెద్దఎత్తునకార్యక్రమాలు నిర్వహించనున్నా రు. దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్,ఇన్స్పెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి చెల్లుబోయిన వేణు, ఇతర ప్రజాప్రతినిధులు, దాతలు, భక్తులు, గ్రామస్తుల సహకారంతో పెద్ద ఎత్తున మహాశివరాత్రి నిర్వాహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కార్యనిర్వహణాధికారిశ్రీదేవివెల్లడించారు.ప్రతి సోమవారం అదేవిధంగా మాస శివరాత్రి, స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం రోజు భక్తులు వేలాదిగా తరలివస్తారు. భక్తులకు తగ్గట్టుగానే ఇక్కడసౌకర్యాలుకూడాసమకూరుస్తున్నారు. మొత్తం మీద దేవాదాయశాఖ ఈ ఆలయాన్ని అద్భుతమైన ఆధ్యాత్మిక టూరిస్ట్ ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాట్లు చేస్తోంది. చాలామంది ద్రాక్షారామ వరకు వచ్చి వెనుతిరిగి వెళ్ళిపోతారు. అలా కాకుండా ద్రాక్షారం నుంచి కోటిపల్లి ఆలయంకు వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఈవో శ్రీదేవి వెల్లడించారు. ఇందుకోసం ద్రాక్షారామం వద్ద ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మొత్తం మీద కోటిఫలి మహాశివరాత్రికి ముస్తాబు అయిపోతోంది. భక్తులకు దర్శనం ఇచ్చేందుకు ముక్కంటి సర్వాంగ సుందరంగా సిద్ధమవుతున్నాడు.





# సమస్యల పరిష్కారానికే 'స్పందన'

**- కమిషనర్ నాగనరసింహారావు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజలు ఎదుర్కొనే స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కారంకావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతీ సోమవారం స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు నిర్వహిస్తోందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు జగనన్నకు చెబుదాంలో భాగంగా డయల్ యువర్ కమిషనర్ నిర్వహించారు. అనంతరం 'స్పందన'లో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్‌లో 13 మంది, స్పందనలో ఆరుగురు వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన ప్రతీ ఒక్క సమస్యకు నాణ్యమైన పరిష్కారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం అయ్యాక అందుకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రజా ఫిర్యాదులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకు రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా ప్రజా సమస్యలు తెలియజేయవచ్చునన్నారు.

**టోల్‌ఫ్రీకి కూడా...** ప్రతీ సోమవారం జరిగే స్పందన, డయల్ యువర్ కమిషనర్ తోపాటు ప్రతీ రోజు టోల్‌ఫ్రీ ద్వారా కూడా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కమిషనర్ నాగనరసింహారావు చెప్పారు. టోల్‌ఫ్రీ నెంబర్1800 4255 990కు ప్రతీరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటలలోపు ఫోన్ చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యకుమారి, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, డీసీపీ హరిదాసు, మేనేజర్ కర్రి సత్యనారాయణ ఈఈ మాధవి, ఏవో శిరీష, వివిధ విభాగాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.


# 174 మద్యం మరియు బీరు బాటిళ్ళు, ఆటో సీజ్

**- డ్రైవర్ అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మరియు కాకినాడ డివిజనల్ టాస్క్‌ఫోర్స్ మరియు ఇంటలిజెన్స్‌వారికి రాబడిన విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం కాకినాడ జగన్నాథపురంలో వాహన తనిఖీ జరుగుతుండగా యానాం నుండి కాకినాడ వైపుగా ఒక ప్రయాణికుల ఆటోలో 650 మి.లి. పరిమాణం గల 120 బీరు బాటిళ్ళు, 750 మి.లి. పరిమాణం గల 10 మద్యం బాటిళ్ళు, 375 మి.లి. పరిమాణం గల 44 మద్యం బాటిళ్ళు మొత్తం 174 మద్యం మరియు బీరు బాటిళ్ళు బయటపడ్డాయి. వాటిని, ఆటోను సీజ్ చేసి, ఆ ఆటో డ్రైవర్ అయిన పెద్దాపురం మండలం నాగంపేటకు చెందిన నందిపు నూకరాజును అరెస్టు చేసి రిమాండ్ చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో యానాం లిక్కరు సరఫరాదారి అయిన సామన గంగల ప్రసాద్‌ను, లిక్కర్‌ను ఆర్డర్ చేసిన కత్తిపూడి గ్రామానికి సంబంధించిన మచ్చి వీరబాబును అరెస్టు చేయవలసి వున్నదని తెలిపారు. ఈ రైడ్‌లో సెబ్ కు చెందిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ పి.సునీల్ కుమార్, ఇంఛార్జి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అజేయకుమార్ సింగ్ మరియు వారి సిబ్బంది ఈ దాడులలో పాల్గొన్నారు.


# గణతంత్ర వేడుకలకు ఢిల్లీ వెళ్ళి వచ్చిన గిరిజన విద్యార్థులు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో వివిధ గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులను గుర్తించి రిపబ్లిక్ డే కు ఎంపిక చేసి ఢిల్లీ పంపడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. రంపచోడవరం ఐటిడిఏ కార్యాలయంలో రిపబ్లిక్ డే వేడుకలకు ఢిల్లీ వెళ్లి వచ్చిన రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని గిరిజన పాఠశాలలో నలుగురు బాలబాలికలు ప్రాజెక్ట్ అధికారిని సోమవారం మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుండి 15 మంది బాలికలు, 15 మంది బాలురు గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి మోటా ఆధ్వర్యంలో రిపబ్లిక్ డే కు ఢిల్లీ తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. ముగ్గురు కేర్‌టేకర్లతో పాటు మొత్తం 33 మంది ఆంధ్రప్రదేశ్ నుండి ఢిల్లీ వెళ్లడం జరిగిందని ఆయన తెలిపారు. రంపచోడవరం ఐటీడీఏ నుండి నలుగురు విద్యార్థులు, చింతూరు ఐటీడీఏ నుండి ఇద్దరు విద్యార్థులు ఏజెన్సీ ప్రాంతం నుండి ఢిల్లీ వెళ్లడం జరిగిందని, అదేవిధంగా భారత ప్రధాన మంత్రిని గిరిజన విద్యార్థులు కలవడం జరిగిందని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్లిన బాలబాలికలకు రిపబ్లిక్ డే లో పాల్గొనేందుకు ఢిల్లీలో పాసులు ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా ఢిల్లీలో ముఖ్యమైన ప్రదేశాలను మోటా వారి ఆధ్వర్యంలో సందర్శించేందుకు బాలబాలికలను తీసుకువెళ్లడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.అబూ సలాం, ఫిజికల్ డైరెక్టర్లు కె.తిరుపతిరావు, కె.రామాయమ్మ, డిప్యూటీ వార్డెన్ ఆదినారాయణ రెడ్డి, పిఈటి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంభనే సీఎం లక్ష్యం

- వైఎస్ఆర్ ఆసరాలో ఎమ్మెల్యే ద్వారంపూడి
- పాల్గొన్న ఎమ్మెల్సీ, కౌడ ఛైర్‌పర్సన్, కమిషనర్, మాజీ మేయర్



**కాకినాడ,మేజర్‌న్యూస్:** ప్రతీ మహిళ ఆర్థిక స్వావలంభన సాధించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం రాజీవ్‌గృహకల్ప,ముస్లిం కమ్యూనిటీ హాల్ ప్రాంతాల్లో వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయా డివిజన్లకు సంబంధించిన మెగా చెక్‌ను విడుదల చేశారు. స్వయం సహాయక సంఘాల సభ్యుల సమక్షంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ మహిళల డ్వాక్రా రుణాలు రద్దు చేస్తామని 2014లో అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చి ఆతరువాత అమలు చేయలేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు దఫాలుగా డ్వాక్రా రుణాలు రద్దు చేస్తామని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకున్నారన్నారు. ఇందులో భాగంగానే నాల్గవ విడత వైఎస్ఆర్ ఆసరా పేరుతో మహిళల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తున్నారన్నారు. నాలుగు విడతల్లో కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి సుమారు 3,800 గ్రూపు సభ్యులకు దాదాపు రూ.102 కోట్ల విలువైన నగదును ఖాతాల్లో జమ చేశారన్నారు. వచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ సి.హెచ్. నాగనరసింహారావు మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా కల్పించే రుణాలు, వైఎస్ఆర్ ఆసరా, చేయూత వంటి పథకాలు ద్వారా వచ్చే నిధులను ప్రతీ మహిళ సద్వినియోగం చేసుకుని ఆర్థికపురోభివృద్ధిసాధించాలని ఆకాంక్షించారు. జీవనోపాధులను మెరుగుపర్చుకుని కుటుంబ పోషణలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఈకార్యక్రమంలోఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడ ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి,వైఎస్ఆర్‌సీపీ నగరాధ్యక్షురాలు సుంకరశివప్రసన్న,ఎఎంసీఛైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు,మాజీకార్పొరేటర్లు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# పిఠాపురం జనసేనలో లుకలుకలు

- కొత్తగా తెరపైకి నాయుడు
- ఉదయ శ్రీనివాస్‌పై అసంతృప్తి





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జనసేన అత్యంత బలంగా ఉన్న నియోజకవర్గాల్లో పిఠాపురం ముందుంది. అదే స్థాయిలో అసమ్మతి కూడా పెరిగిపోయింది. పార్టీ ఇన్చార్జిగా ఉన్న శేషుకుమారిని తొలగించి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్‌ని నియమించారు. టీ టైం అధినేత అయిన శ్రీనివాస్ పవన్‌కు సన్నిహితుడు అన్న పేరు ఉంది. ఆయన పరిచయం చేసుకునేందుకు ఏర్పాటు చేసిన తొలి సమావేశంలోనే జనసైనికులు రెండుగా చీలిపోయి కొట్టుకున్నారు. ఇపుడు అసమ్మతి మరింత పెరిగింది. పవన్ కళ్యాణ్ కాకినాడలో మూడు రోజులు బస చేసినప్పుడు ఉన్న గెస్ట్ హౌస్ ఉదయ్ శ్రీనివాస్ దే అని, పవన్ కళ్యాణ్‌తో తన అనుబంధం ఇదేనంటూ ఆయన ప్రచారం చేసుకుంటున్నారని నేతలు ఆరోపిస్తున్నారు. చుట్టూ బౌన్సర్లను పెట్టుకుని పవన్ స్థాయిలోనే ఆయన కూడా సెక్యూరిటీ మధ్య తిరుగుతుంటారు. దీంతో సమావేశంలు జరిగినపుడు కూడా ఆయన చుట్టూ బౌన్సర్లు ఉంటారు. ఈ నేపథ్యంలో సామాన్య కార్యకర్తలకు ఆయన అందుబాటులో లేరన్న పేరు ఉంది. పైగా ఆయనకు ఫోన్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయరని పార్టీకి సంబంధించిన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి నేపథ్యంలో ఉదయ్ శ్రీనివాస్‌కు టికెట్ ఇస్తే పార్టీ ఓడిపోవడం ఖాయం అన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. మరోపక్క పార్టీలో సీనియర్ లు అయిన డాక్టర్ పిల్లా శ్రీధర్, తమ్మయ్య నాయుడు వంటి వారు సైతం అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. దీనికితోడు తమ్మయ్య నాయుడుకు జనసేన నుంచి పిఠాపురంలో పోటీ చేసే అవకాశం ఇవ్వాలని వాదన పెరుగుతోంది. వారాహి యాత్ర సందర్భంగా కాకినాడ జిల్లాకు వచ్చిన పవన్ మూడు రోజులు ఆయన ఇంట్లోనే ఉన్నారు. 2019లో కూడా తొలుత శేషుకుమారికి టికెట్ ఇవ్వడానికి ముందు తమ్మయ్య నాయుడు పేరు పరిశీలించారు. అనంతరం శేషుకుమారికి బీఫామ్ ఇచ్చారు. అయినా ఆయన పార్టీ కోసం పని చేస్తానని వెల్లడించారు. ఇలాంటి నేపథ్యంలో 2024 ఎన్నికల్లో తమ్మయ్య నాయుడుకు అవకాశం కల్పిస్తామని పార్టీ పెద్దలు అవకాశం హామీ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. మరో పక్క డాక్టర్ పిల్లా శ్రీధర్ కూడా తన సొంత ఆస్తులు పార్టీ కోసం వెచ్చిస్తున్నారు. వీరిని పట్టించుకోకుండా ఉదయ శ్రీనివాస్ ఏకపక్షంగా వెళుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉదయ శ్రీనివాస్‌కు టికెట్ ఇస్తే వైసీపీ నుంచి వంగా గీత గెలుపు ఖాయం అని జనసైనికులే చెప్పడం విశేషం. తాజాగా ప్రముఖ విద్యావేత్త, మాధురి విద్యాసంస్థల అధినేత తమ్మయ్యనాయుడు పేరు తెరపైకి వచ్చింది. ఆయన స్థానికుడు, కాపు సామాజికవర్గంలో మంచి పట్టున్న నేత. స్వాతంత్ర సమరయోధుల కుటుంబానికి చెందినవారన్న వాదన పెరుగుతోంది. దీనికి తోడు 2019లో టికెట్ ఇస్తామని చెప్పారు. శేషుకుమారి కిచ్చారు. తిరిగి టిక్కెట్ రద్దు చేసి తమ్మయ్య దొరకు ఆఫర్ ఇచ్చారు. ఆయన హుందాగా శేషుకుమారికి మద్దతు పలికారు. పార్టీ కోసం ఆయన పనిచేస్తూనే వున్నారు. గొల్లప్రోలు, పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాల్లో మంచి పట్టున్న నేత. అదేవిధంగా డాక్టర్ శ్రీధర్ కూడా తనదైన స్థాయిలో టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఉదయ శ్రీనివాస్ కు టికెట్ ఇచ్చే బదులు టిడిపిలో వర్మకి టికెట్ ఇస్తే తామంతా పొత్తులో భాగంగా టిడిపికి సహకరిస్తామని జనసేన సీనియర్ నేతల సైతం అంగీకరిస్తున్నారు. దీనికి తోడు మూడు రోజుల క్రితం నియోజకవర్గం వచ్చిన పార్టీ ఫైర్ బ్రాండ్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జయహో బీసీ సభలో వర్మ స్థానికుడు. అతనికి ఓటేసి గెలిపిస్తే మీకు అందుబాటులో ఉంటాడు. ఎక్కడో బయట నుంచి వచ్చిన వ్యక్తికి ఓటు వేస్తే బస్సు, కారు, రైల్లో వెళ్లి ఆయన దగ్గరికి వెళ్ళాలి. ఆయన మీ మాట వింటారని నమ్మకం లేదు. వర్మకి ఓటు వేయండని నేరుగా పిలుపునిచ్చారు. దీనిని బట్టి వర్మకి టికెట్ ఇవ్వకపోతే ఆయన స్వతంత్రంగా ఖచ్చితంగా పోటీ చేస్తారు అన్న ప్రచారం జరుగుతోంది. జనసేనకు టికెట్ ఇస్తే వర్మ సహకరిస్తాడా లేదా అన్నది సందేహమే. పవన్ కళ్యాణ్ పోటీ చేస్తే తాను కచ్చితంగా మద్దతు ఇస్తామని వర్మ ప్రకటించారు. దీంతో ఇస్తే తమ్మయ్య నాయుడుకు టికెట్ ఇవ్వాలి లేదా పవన్ కళ్యాణ్ నేరుగా పోటీ చేయాలి. ఉదయ శ్రీనివాస్ కి టికెట్ ఇస్తే మాత్రం తాము సహకరించమని జనసైనికులు చెబుతున్నారు. దీంతో పిఠాపురంలో రాజుకున్న అసమ్మతిని ఎలా సర్దుబాటు చేయాలో తెలియని పరిస్థితి పార్టీలో నెలకొంది. నేరుగా పవన్ కళ్యాణ్ దృష్టి పెడితే తప్ప ఇక్కడ పరిస్థితులు చక్కబడేలా కనపడటం లేదు.

## జాతీయ స్థాయి టైక్వాండో పోటీలలో సత్తా చాటిన అంబాజీపేట విద్యార్థులు



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** ఈ నెల 19వ తేదీ నుండి 21వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం, సవాయి, మాధవపూర్‌లో జరిగిన జాతీయస్థాయి మహిళ విభాగం టైక్వాండో పోటీలు జరిగాయి. ఈ పోటీలలో అంబాజీపేట మండలానికి చెందిన ముగ్గురు విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు. కుసుమ వైష్ణవి మొదటి స్థానాన్ని, బొక్క హేమలత సౌమ్య రెండో స్థానంలో, పితాని భార్గవి శ్రీకళ మూడో స్థానాన్ని జాతీయస్థాయిలో కైవాసం చేసుకుని అంబాజీపేట కీర్తి ప్రతిష్టలను జాతీయస్థాయిలో నిలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు కె.వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్ లు క్రీడాకారులు ముగ్గురిని అభినందించారు. అత్యుత్తమ శిక్షణ ఇచ్చిన టైక్వాండో మాస్టర్ పితాని త్రిమూర్తులను అభినందించారు.

## కలెక్టర్ హామీతో నిరవధిక నిరాహారదీక్ష విరమణ





- నిమ్మరసం అందించిన ఆర్‌డిఓ, డిఎస్పీ
- అఖిలపక్షం నుండి ధర్నాస్థలి అభ్యంతరాల స్వీకరణకు ఫిబ్రవరి 5న ఆర్‌డిఓ సమావేశం

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జనవరి 26 నుండి గత 4 రోజులుగా కాకినాడ ధర్నాస్థలి అభ్యంతరాలు పరిశీలించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక నిరాహారదీక్ష శిబిరం నుండి అన్ని రాజకీయ పార్టీల నాయకులు ప్రజాసంఘాల ప్రతినిధులు సోమవారం జిల్లా గ్రీవెన్స్‌లో కృతిక్ శుక్లాని కలిసి విన్నవించారు. ఈమేరకు ఫిబ్రవరి 5వ తేదీన శనివారం సాయంత్రం 4గంటలకు కాకినాడ ఆర్‌డిఓ కార్యాలయం మీటింగ్ హాలులో సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్‌డిఓ సురేష్, డిఎస్‌పి పి.మురళీకృష్ణా రెడ్డిని జిల్లా యంత్రాంగం తరపున దీక్షా శిబిరం వద్దకు పంపించి నిమ్మరసం అందించి నిరాహార దీక్ష విరమణ చేయించారు.

# ఐటీడీఏ గ్రీవెన్స్‌లో సమస్యలపై 61 వినతులు

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** రంపచోడవరం ఐటిడిఎ సమావేశం హాలులో వివిధశాఖలఅధికారులతో సోమవారం స్పందన కార్యక్రమాన్ని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ కలిసి నిర్వహించారు. ఈసందర్భంగా ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే మాట్లాడుతూ సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వివిధ సమస్యలపై 61 వినతులు రావడం జరిగిందని తెలిపారు. మారేడుమిల్లి మండలం వేటుకూరు పంచాయతీలో సుమారు 200 మంది గిరిజన రైతులకు 200 ఎకరాలలో రబ్బరు ప్లాంటేషన్ వేసుకునేందుకు రబ్బరు మొక్కలు మంజూరు చేయాలని వేటుకూరు గ్రామపంచాయతీ సర్పంచ్ ఈతపల్లి మల్లేశ్వరి, ఆదిరెడ్డి ఐటీడీఏ పీవోకు వినతిపత్రాన్ని సమర్పించారు. రంపచోడవరం మండలం బివెలమలకోట పంచాయతీలో నేషనల్ హైవే 516ఇలో రోడ్డు వెడల్పు వల్ల ఇరువైపులా నష్టపోయిన బాధితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని, కొత్త కరెంటు మీటర్లు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అర్హులైన గిరిజనులకు 5 కిలోల గ్యాస్ సిలిండర్లు మంజూరు చేయాలని బీవీ కోట గ్రామ సర్పంచ్ వంతల అత్యాయమ్మ, కానేం రాజు విజ్ఞప్తి చేశారు. గంగవరం మండలం చిన్న అడ్డపల్లి, పెద్ద అడ్డపల్లి గ్రామాలలో నేషనల్ హైవే రోడ్డు వెడల్పుకు వాటర్ ట్యాంకులు పోయినందున కొత్త వాటర్



ట్యాంకులు నిర్మించి త్రాగునీరుఏర్పాటు చేయాలని కంగల వెంకన్నదొర, మడకం బుల్లిదొర, కంగల శ్రీనివాస్‌దొరవినతి పత్రాన్ని సమర్పించారు. రంపచోడవరం మండలం ఐ.పోలవరంగ్రామంలో తనకు ఆర్‌ఓఎఫ్‌ఆర్ ద్వారా కేటాయించిన భూమిలో వెంకటేశ్వరస్వామిఆలయం నిర్మించడం జరిగిందని, వేరొక చోట తనకు భూమి ఏర్పాటు చేయాలని కుంజం గన్నమ్మ దరఖాస్తు సమర్పించారు. రాజవొమ్మంగి మండలం కొండపల్లి గ్రామంలో నేషనల్ హైవే 516ఇ రోడ్డు వెడల్పులో తనకు రావలసిన నష్ట పరిహారం ఇప్పించాలని వీరబోయినబాలరాజు దరఖాస్తు సమర్పించారు. పందిరి మామిడినుండి చవిటి దిబ్బలు గ్రామాల మధ్యలో పది కిలోమీటర్ల రహదారి సరిగా లేనందున రాకపోకలకు రెండు మండలాలకుసంబంధించినప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే పనులు ప్రారంభించి రోడ్డు పూర్తిచేయాలని అన్నిక పండమ్మ, చిలకల విజయశాంతి, కింటుకూరు సూరిబాబు, గొర్లె సోమరాజు, కాకూరి నరసమ్మ, బిజ్జి మాణిక్యం సుమారు వందమంది ప్రాజెక్ట్ అధికారిని కలిసి దరఖాస్తు సమర్పించారు. రంపచోడవరం మండలం చెరువుపాలెం గ్రామంలో ఇంటింటికి కుళాయిల ద్వారాత్రాగునీరు ఏర్పాటు చేయాలని ముర్ల అన్నవరం,అప్పారావు, కరక అబ్బులు దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శాస్త్రి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అబూ సలాం, ఏడి యం హెచ్‌ఓ జి.ప్రకాశం,ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, డిఎల్‌పిఓ రాఘవన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుజి.డేవిడ్‌రాజ్,సుబ్బయ్య, ఎ.రవి కుమార్, ఏడిఏ సిహెచ్‌కెవి చౌదరి, పిఏఓ రాంబాబు, డాక్టర్ ఇందిర, సిడిపిఓ సంధ్యారాణి, జిసిసి సీనియర్ మేనేజర్ ముర్ల నాగ వెంకట రాజారెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సాయి సతీష్, రాజేంద్ర బాబు, మల్లికార్జున రావు, రామచంద్రమూర్తి, లీగల్ సెల్ డిప్యూటీ తహసిల్దార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రూ 8.89 కోట్లతో జీవన్ మిషన్ పథకంకు శంఖుస్థాపన



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందించే లక్ష్యంగా జీవన్ మిషన్ పథకం ద్వారా రెండవ దశ పనులు ప్రారంభించుటకు శిలాఫలక ఆవిష్కరణ కార్యక్రమంను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ చైర్మన్, పి.గన్నవరం నియోజకవర్గవైసిపి ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబులుసోమవారం ప్రారంభి ంచారు.మండలంలోని 13గ్రామాల ప్రజలకు తాగునీరు అందిం చేందుకు మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో రూ.11.33 కోట్ల రూపాయలతో ఇంటింటికీ మంచినీరు అందించే కార్యక్రమాల్లో భాగంగా నూతనంగా పైపులైన్లు మరియు వాటర్ ట్యాంకులు నిర్మాణం చేయుటకు భూమిపూజచేసారు. ఈ కార్యక్ర మంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైఎస్ఆర్ సీపీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంధ్ర బాప్టిస్ట్ డైమండ్ జూబ్లీ ఉత్సవాల కరపత్రికలు ఆవిష్కరణ



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి 60 వసంతాల డైమండ్ జూబిలీ ఇత్సవాల కరపత్రికలు ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం స్థానిక ఆంధ్ర బాప్టిస్ట్ చిర్చిలో నిర్వహిం చారు. సంఘ అధ్యక్షులు బిఎస్ వందనం కరపత్రాలను అనిస్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ మిషనరీలు కేటాయించిన స్థలంలో నడుస్తున్న చర్చిని ప్రారంభించి 60సంవత్స రాలు పూర్తయినా సందర్భంగా ఫిబ్రవరి 16వ తేదీన డైమండ్ జూబిలీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని 14,15 తేదీల్లో రెండురోజుల ఉజ్జీవ సభలు స్థానిక చర్చిలో రాత్రి కూడికలుగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సభల్లో విశాఖపట్టణానికి చెందిన పిఎ స్వామి ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేసి పాల్గొంటున్నట్టు చెప్పారు. ఈ ఉత్సవాల్లో క్రైస్తవ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి రెవ. బి కిరణ్ కుమార్, సంఘ నాయకులు టి సూర్యారావు, బి అన్నపూర్ణ, పిట్టా సత్యనారాయణ, ఐఈ జీవన్ కుమార్, జివి రాఘవ, పున్నమి చంద్రు డు, డిజీ రాజేశ్వర రావు, రెవ. బి అరుణ, అందుగుల స్టీఫెన్ రాజు ,బొడ్డు రామారావు, ఊబా లక్ష్మణరావు,టి అమర్ కళ్యాణ్, అందు గుల రాధాకృష్ణ, స్త్రీల సమాజ నాయకులు ఊబా లక్ష్మి, బి శ్రీలక్ష్మి, పాలిక కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్రేయపురంలో రూ.1 కోటీ 18 వేల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించిన చిర్ల జగ్గిరెడ్డి



**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్:** సోమవారం ఆత్రేయపురం గ్రామంలోని ప్రభుత్వ ఆసుపత్రి నందు 50 లక్షల రూపాయలతో నిర్మించిన 64 లాబ్ మరియు అదనపు సౌకర్యాల భవనాన్ని, అక్కడే 7 లక్షల రూపాయలతో నిర్మించిన ఆయుష్ ఆసుపత్రి భవనాన్ని, 43 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, 17.5 లక్షల రూపాయలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్ భవనాన్ని ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో 17,000 పైనే ఇళ్ళ పట్టాలు అందించామని, 2,800 కోట్ల రూపాయలు వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రజలకు అందించామని, 650 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిం చామని, 2019లో చెప్పినట్టు మరలా బుద్ధి చెప్పి, మీ ఇంట్లో మంచి జరిగితేనే నాకు ఓటు వెయ్యండి, నా పొత్తు ప్రజలతోనే అని చెప్పే దమ్మున్న నాయకుడైన జగన్ కే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతి గిరిజనుడు ఎస్సీ, ఎస్‌టి పిఓఏ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



- సిఐడి ఇన్స్పెక్టర్ జివివి.సత్యనారాయణ

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** ఏజెన్సీలో ప్రతి గిరిజన పౌరుడు ఎస్సీ ఎస్టీ పిఓఏ యాక్ట్ 1989 చట్టంపై అవగాహనకలిగి ఉండాలని రాజమహేంద్రవరం సిఐడి ఇన్స్పెక్టర్ జివివి సత్యనారాయణ అన్నారు. మండలంలోని రాజవొమ్మంగి సర్కిల్ పరిధిలోని జడ్డంగి పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఉదయం స్థానిక ఎస్సైటి.రఘునాథరావు ఆధ్వర్యంలో గిరిజన ప్రజా ప్రతినిధులకు, గిరిజనులకు ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిఐడి ఇన్స్పెక్టర్ జివివి సత్యనారాయణ మాట్లాడుతూ గిరిజన చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడే గిరిజనులపై జరుగుతున్న ఆకృత్యాలకు అడ్డు కట్ట వేయడం జరుగుతుందన్నారు. ఎస్సీ ఎస్టీ పివోఏ చట్టం గురించిమాట్లాడుతూ రాజ్యాంగ పీఠికలో సహోదర భావం విశిష్టత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వివరించడం జరిగిందని, ఫిబ్రవరి 20న అడ్వకేట్ జనరల్ సుప్రీంకోర్టులో వాదన సమయంలో ఆర్టికల్ 17 అన్ టచబిలిటీ గురించి ఆత్మ పరిశీలన చేసుకుని 76 ఏళ్లుగా మనం ఇప్పటికీ మనం విధితో ట్విస్ట్ తో ప్రయోగం చేయడం జరుగుతుందన్నారు. గిరిజనులు తినరాని అసహ్య పదార్థలను తినిపించడం, తాగించటం,వారి ఇంటి ముందు చెత్త వేయడం, గాయపరచడం అవమానపరచడం,చెప్పుల దండలు వేయడం,నగ్నంగా ఊరేగించడం,శిరోమండలం,గిరిజనుల ఆత్మ గౌరవాన్ని కించపరచడం,భూ ఆక్రమణ, భూముల నుండి గెంటి వేయడం వంటివి నేరం అన్నారు,సిఐడి యూట్యూబ్ వీడియోస్ సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930 గూర్చి వివరించారు,రాజవొమ్మంగి తాహశీల్దార్ సుబ్రహ్మణ్య ఆచారి,జడ్డంగి ఎస్ఐ రఘునాథరావు తదితరులు మాట్లాడుతూ,గిరిజన చట్టాలపై అవగాహన కలిగి అవసరమైనప్పుడే వాటిని వినియోగించాలని అనవసరంగా దుర్వినియోగం చేయకూడదన్నారు,ఈ కార్యక్రమంలో సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ,జెడ్పిటిసి ఒడుగుల జ్యోతి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు లు మాట్లాడుతూ గిరిజన చట్టాలు అందరికీ తెలియాలని, హక్కులు కాపాడుకోవాలని ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.చికిలింత, గొబ్బిలిమడుగు సర్పంచులు కోండ్ల సూరిబాబు,చంద్రుడు, ఏపీ సిఐడి ఎస్ఐ కేవీవీ శ్రీనివాస్, హెచ్ సి సత్యనారాయణ పోలీస్ సిబ్బంది బుచ్చయ్య ప్రసాద్ రెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు,పెద్ద సంఖ్యలో గిరిజన యువత,గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాజధానిని ముట్టడించే వరకు ప్రభుత్వం దిగి రాలేదు

- సిఐటియు ప్రధాన కార్యదర్శి పి.వెంకట్

**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్:** జగన్మోహన్ రెడ్డి ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకో పోవడంతో రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడి హెల్పర్స్ అండ్ వర్కర్స్ 42 రోజులపాటు నిరవధిక సమ్మె చేయడంతో పాటు రాష్ట్ర రాజధాని ముట్టడించే వరకు అంగన్వాడీల హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం దిగి రాలేదని సిఐటియు ప్రధాన కార్యదర్శి పి వెంకట్ అన్నారు. మండల కేంద్రమైన రాజవొమ్మంగి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అంగన్వాడీల విజయోత్సవ సభ జరిగింది. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పుట్టా రామరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి వెంకట్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు అంగన్వాడీలను గుర్రాలతో తొక్కించారని, జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలు నిలబెట్టుకో పోవడంతో దీక్షలు చేపట్టాల్సి వచ్చిందని కార్మికుల పోరాటాలకు సిఐటియు అండగా ఉంటుందని వెంకట్ అన్నారు. అంగన్వాడీల పోరాటం చరిత్రగా నిలిచిపోతుందని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు అన్నారు. అంగన్వాడీలు 42 రోజులపాటు దీక్షలు చేపట్టి ప్రభుత్వంతో పోరాడి 11 డిమాండ్లు సాధించుకున్నారని అంగన్వాడీల జిల్లా కార్యదర్శి బి నిర్మల అన్నారు. మనందరకు ఎర్రజెండా అండగా ఉంటుందని కలిసి పోరాడితే సాధించలేనిది ఏమీ ఉండదని డి వై ఎఫ్ ఐ నాయకులు శ్రీను అన్నారు. అనంతరం అంగన్వాడీలు దుశాలువా లతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటలక్ష్మి, చిన్ని కుమారి తదితరులు ఉన్నారు.

# శంఖారావానికి తరలిరండి..

- హిస్టరీ క్రియేట్ చేద్దాం.. సిద్ధంగా ఉండండి..
- వై.సి.పి.పార్టీ మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు



**వి.ఆర్.పురం,మేజర్‌న్యూస్:** వచ్చేనెల3తారీకునశంఖారావం సభకు ప్రజలు కార్యకర్తలు, నాయకులు,అభిమానులు, భారీగా తరలివచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి,పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో నిర్వహించే బహిరంగ సభను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేయాలని వై.సి.పి.మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు, కార్యకర్తలు,అభిమానులకు,పార్టీ ముఖ్యులకు దిశానిర్దేశం చేశారు. సోమవారం, జె.సి.ఎస్.ఇంచార్జీ బొడ్డు సత్యనారాయణ, అధ్యక్షతన మాదిరెడ్డి సత్తిబాబు స్వగృహంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూ వరరామచంద్రాపురం మండలానికి ఎమ్మెల్సీ అనంత బాబు, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో9 బస్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని ఎన్నికల శంఖారావం సభను విజయవంతం చేయాలని సూచించారు. మండల పరిధిలో ఉన్న ప్రతీ పంచాయతీ నుండి కార్యకర్తలు కదలి రావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఎస్.టి.ఎస్.సి. కమీషన్ సభ్యులు చిక్కాల బాలకృష్ణ,(బాలు)యూత్ లీడర్ ముత్యాల గౌతమ్, మామిడి రాజు,శ్రీరామగిరి, వడ్డిగూడెం, రాజపేట,నుండి కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబు కాతేరు రా కదలిరా సభకు భారీగా తరలివెళ్లిన తెదేపా, జనసేన శ్రేణులు

- ఇరుపార్టీల శ్రేణులను సమన్వయపరిచిన బూరుగుపల్లి, బోగవల్లి



**పెరవలి, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు రాష్ట్ర మాజీముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా జనవరి 29వ తేదీ సోమవారం తూర్పుగోదావరి జిల్లా కాతేరులో జరిగిన రా కదలిరా బహిరంగ సభకు నిడదవోలు నియోజకవర్గం తెదేపా ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బూరుగుపల్లి శేషారావు జనసేన నిడదవోలు నియోజకవర్గం ఇంచార్జ్ భోగవల్లి ప్రసాద్ ల నేతృత్వంలో పెరవలి మండలం నుండి మండల తెదేపా అధ్యక్షులు అతికాల కృష్ణమ్మ పెరవలి మండలం జనసేన అధ్యక్షుడు పెప్పర రవికుమార్ ల అధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. ప్రతి గ్రామం నుండి బైక్ ర్యాలీలతో ఆటోలు కార్లు వ్యాన్ల లో కార్యకర్తలు కాతేరు సభకు తరలివెళ్లారు. ఇరు పార్టీలకు చెందిన నాయకులు చక్కటి సమన్వయంతో పనిచేయడంతో పెరవలి మండలంలో ఈ కార్యక్రమం విజయవంతంగా చేయగలిగామని ఇరు పార్టీల నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ అధ్యక్షులు భూపతి రాజు రవ్వర్మ బొడ్డు రామాంజనేయులు సలాది కృష్ణమూర్తి సలాది శ్రీహరి వాకలపూడి వీర్రాజు కంటిపూడి సూర్యనారాయణ ముళ్ళపూడి రాజేంద్రప్రసాద్ మేడ్చల్ బుజ్జి గొర్రె పెద్ద కాపు పడాల రామస్వామి రంగినేడి కట్లయ్య రెడ్డి సత్యనారాయణ వేంద్ర వెంకట రామ్మూర్తి కాళదాసు వీరేష్ బాబు మంగం రామారావు అబిశెట్టి సత్తిరాజు హనుమంతు సుబ్రహ్మణ్యం శేషు తదితర తెదేపా నాయకులతో పాటు నందిప శ్రీనివాస చక్రవర్తి కోటిపల్లి మురళీకృష్ణ మేడిచర్ల శివ కోలా సితయ్య నాయుడు ఆకుల సుబ్బరాయుడు రేలంగి రాజేష్ చిట్టిడి త్రిమూర్తులు తాత రా జనసేన నాయకులు కార్యకర్తలు కాతేరు సబకు భారీగా తరలి వెళ్లారు నిడదవోలు తెదేపా ఇంచార్జ్ బురుగుపల్లి శేషారావు మాట్లాడుతూ కాతేరు లో జరిగిన రా.. కదలిరా.. బహిరంగ సభకు నిడదవోలు నియోజకవర్గం లో ప్రతి గ్రామం మరియు పట్టణ వార్డ్ ల నుండి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న తెలుగు దేశం మరియు జన సేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, శ్రేయోబిలా సులకు, నియోజకవర్గ ప్రజలకు ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియచేశారు.

## షాపింగ్ మాల్స్ కార్మికుల సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు సిఐటియు వినతి

- పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖను ఆదేశించిన కలెక్టర్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** షాపింగ్ మాల్స్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఉదయం సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి. బేబిరాణి మాట్లాడుతూ కాకినాడ నగరంలో షాప్స్ మరియు మాల్స్‌లో పెద్దసంఖ్యలో కార్మికులు, ముఖ్యంగా మహిళా కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. కేరళ తమిళనాడు తరహాలో మాల్స్‌లో పనిచేసే కార్మికులకు స్టూల్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా మహిళలకు వారాంతపు సెలవు ఖచ్చితంగా ఆదివారం అమలు చేసి పిల్లలతో గడిపే అవకాశం ఇవ్వాలన్నారు. షాప్స్ మరియు మాల్స్ యజమానులు వివిధ రకాల పన్నులు ప్రభుత్వానికి చెల్లిస్తారు కాబట్టి కార్మికులకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చేయించాలన్నారు. చట్ట ప్రకారం బోనస్ అమలు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరుతున్నామన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా కార్మికశాఖ అధికారులను పిలిచి పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సహాయ కార్మిక శాఖ కమిషనర్ వై.బుల్లిరాణి మాట్లాడుతూ డిసిఎల్ దృష్టికి తీసుకెళ్లి కలెక్టర్ ఆదేశాలు అమలు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## జగన్మోహన్ రెడ్డికి మొదలైన కౌంట్ డౌన్

- ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్న ప్రజలు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ పార్లమెంటు అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ సోమవారం జగన్మోహన్ రెడ్డి సిద్ధం అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై స్పందిస్తూ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి ప్రజలకు చేసిన అన్యాయాన్ని తట్టుకోలేక ఎన్నికలు ఎప్పుడు వస్తాయా జగన్మోహన్ రెడ్డిని ఇంటికి ఎప్పుడు పంపేద్దామా అని ఎదురుచూస్తున్నారని అన్నారు. యుద్ధం మొదలైందని, ఆ యుద్ధంలో తలపడేందుకు టిడిపి ఎప్పుడైనా సిద్ధమే అని ఈ యుద్ధంలో టిడిపి-జనసేన కూటమి విజయం తథ్యం అని, ఈసారి ఎన్నికల్లో ధర్మానికి అధర్మానికి జరిగే యుద్ధం అని, ఈ యుద్ధంలో పార్టీల కంటే ప్రజలే ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని దీనంతటికి కారణం జగన్మోహన్ రెడ్డి నిరంకుశ పాలనే అన్నారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల వారిని, అన్ని వ్యవస్థలను నాశనం చేసిన ఘనత చరిత్రలో ఒక జగన్మోహన్ రెడ్డి కే చెందుతుందని జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు.


## జగనన్నకు చెబుదాం -స్పందనకు 398 అర్జీలు





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలకు తక్షణమే పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ డా కృతికాశుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టర్ కార్యాలయ స్పందన సమావేశ మందిరంలో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా..జేసీ ఇలక్కియ, ఇన్చార్జి డీఆర్‌వో, డీఆర్డీఏ కె.శ్రీరమణి, సీపీవో పీ.త్రీనాథ్, జిల్లా పంచాయతీ అధికారిణి కె.భారతి సౌజన్య, బీసీ కార్పొరేషన్ ఈడీ అద్దంకి శ్రీనివాసరావు, కాకినాడ డీఎల్డీవో పి.నారాయణమూర్తిలతో కలిసి జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కారిం చవలసిందిగా ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలుచేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూవివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 398 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి వినతిని సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం ఇవ్వాలనన్నారు. ఒకే అంశంపై మళ్ళీ మళ్ళీ అర్జీలు నమోదు కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఈ సందర్భంగా అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి రూ.50 వేలు విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న [illegible] వెంకటేశ్వరస్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి శ్రీ వేంకటేశ్వర వాసవి నిత్య అన్నదాన ట్రస్ట్ వాడపల్లి వారి తరుపున చైర్మన్ శిఘాకొళపు శివరామ సుబ్రహ్మణ్యం రూ.50 వేలు విరాళం అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో సత్యనారాయణరాజు, కమిటీ సభ్యులు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

# స్పందనలో వచ్చిన అర్జీలు 186 - కలెక్టర్ మాధవీలత



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** స్పందనలో వచ్చిన అర్జీలపై నిర్ణీత కాలవ్యవధిలోగా చర్యలు తీసుకుని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. కె.మాధవీలత అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ ఎన్‌తేజ్ భరత్, డిఆర్ఓ నరసింహులు, టూరిజం ఈడి వి స్వామీ నాయుడు, ఎస్ డి సి కృష్ణ నాయక్ లతో కలిసి కలెక్టర్ మాధవీలత అర్జీలు పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. కే .మాధవీ లత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి కి ఆమేరకు సేవలు అందించడం లో జవాబుదారీతనం, పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు.. ఈరోజు స్పందనలో 186 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించామన్నారు. ఇందులో ఆన్లైన్లో 164 ,ఆఫ్లైన్‌లో 22 అర్జీలు ఉన్నాయని తెలిపారు. వాటిలో రెవెన్యూ 71,పంచాయతి రాజ్ 33,పోలీస్15 ,విద్యుత్ 12 తదితర శాఖల అర్జీలు ఉన్నట్లు తెలిపారు.

# చైర్‌పర్సన్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి కుటుంబాన్ని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప సోమవారం పరామర్శించారు. ఇటీవల చైర్ పర్సన్ అరుణ మామాగారైన గంగిరెడ్డి స్వామి నాయుడు మృతి చెందిన విషయం విదితమే.కాగా ఎమ్మెల్యే రాజప్ప చైర్ పర్సన్ కుటుంబాన్ని పరామర్శించి స్వామి నాయుడు చిత్రపటం వద్ద ఆయన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, తాతపూడి అరుణవంశి, నిమ్మకాయ కిరణ్,తదితరులు పాల్గొన్నారు.

# పేదల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం.. కాకినాడ ఎంపీ వంగా గీత

**గొల్లప్రోలు,మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో మంచి చెడుల మధ్య ఎన్నికల సమరం మొదలయ్యిందిఅన్నారు.కాకినాడ ఎంపీ వంగా గీత గొల్లప్రోలు పట్టణ పరిధి రాయవరం రోడ్డు గాంధీనగర్ సెంటర్ శ్రీ వాసవి కళ్యాణ మండపంలో సోమవారం గొల్లప్రోలు నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ అధ్యక్షతన ఏర్పాటుచేసినటువంటి 4వ.విడత వైయస్సార్ ఆసరాకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగాగీతావిశ్వనాథం పిఠాపురం శాసన సభ్యులు పెండెం దొరబాబు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. అనంతరం ఎమ్మెల్యే ఎంపీ చేతుల మీదగా జ్యోతి ప్రజ్వలన చేసి ఎమ్మెల్యే దొరబాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థులు మహిళలను ఆకట్టుకునే విధంగా సంస్కృతిక జానపద నృత్యాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డోక్రా మహిళల సంఘాలను ఉద్దేశించి పిఠాపురం వైయస్సార్ పార్టీ ఇంచార్జ్ వంగా గీతా విశ్వనాథం ఇలా ప్రసంగించారు. మహిళా ఆసరా సాధికారత మహిళా అభివృద్ధి ఏంటని డోకా సంఘాల మహిళలను సమావేశం ద్వారాప్రశ్నించారు.ప్రభుత్వం డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రభుత్వ బ్యాంకులు ద్వారా అందిస్తున్న రుణం అంటే అప్పు ఎవరుతీర్చాలి మహిళలను చెప్పమన్నారు. అలాగే ప్రభుత్వం మనకిచ్చిన అప్పు మనమే తీర్చుకోవాలి అంతే కదా మన జగనన్న ప్రభుత్వం అలా చేయలేదు మహిళా సంక్షేమమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మహిళలకు పెద్దపీటవేస్తూ డొకా సంఘాల రుణాలు 25 వేల కోట్ల డోక్రా రుణాలు మాఫీచేసిన ముఖ్య మంత్రి దేశంలో ఎవరైనా ఉన్నారా అది మన ప్రియతమా ముఖ్యమంత్రి



జగన్మోహన్ రెడ్డి అన్నారు కాకినాడ ఎంపీ వంగా గీత గత టిడిపి ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రిచంద్రబాబు చేసిందేమిటి అని ప్రశ్నించారు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అక్కా చెల్లెమ్మలకు మంచి జరగాలన్న సంకల్పంతో జగనన్న డ్వాక్రా రుణమాఫీ చేపట్టడం జరిగిందన్నారు ఆలోచించండి మనకు మేలు చేసేది ఎవరు కీడు తలపెట్టేది ఎవరు అన్నారు దీనిపై నిర్ణయాన్ని మీకే విడిచిపెడుతున్నానని కాకినాడ ఎంపీ ఒంగా గీత పేర్కొన్నారు ఈ నాలుగున్నర సంవత్సరాల నుండి పేదలకు నిబద్దలతో జగనన్న వివిధ సంక్షేమ పథకాలు అర్హుల ఖాతాల్లోకి జమ చేసిన ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏం అన్నారు అలాగే పిఠాపురం శాసనసభ్యులు పెండెం దొరబాబు మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ ఆవిర్భావం నుండి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అడుగుజాడల్లోనే నడిచానని అన్నారు పిఠాపురం నియోజకవర్గం పట్టణ పల్లె గ్రామాలలో నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ గడపగడపకు మన కార్యక్రమం విస్తృతంగా సాగిస్తూ నిరంతరం ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నానన్నారు. అలాగే తాను రాజకీయాల్లో ఉన్న లేకపోయినా పిఠాపురం నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడూ అన్ని విధాల అండగా ఉంటానని కార్యక్రమంలో వెల్లడించారు . అనంతరం ఎంపీ గీత ఎమ్మెల్యే దొరబాబు జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున వైయస్సార్ పార్టీకార్యకర్తలు అయ్యారావు మిత్ర మండలి సభ్యులు పలువురు కౌన్సిలర్లు 10వ. వార్డ్ కౌన్సిలర్ మొగలి దొరబాబు 2వార్డ్ మహిళా కౌన్సిలర్ మైనం భవాని చెక్కపల్లి దివాణం మాజీ జెడ్పిటిసి అంజూరి రాంబాబు వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు తెడ్లపు నాగేంద్ర పిఠాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ మొగలి బాబ్జి అన్నవరం దేవస్థానం పాలకమండ లి సభ్యుడు వైయస్సార్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మొగలి అయ్యారావు చందుర్తి ఉపసర్పంచ్ కోనేటి పెద్దకాపు మొగలి జై బాబు గొల్లప్రోలు విశాల సహకార పరపతి సంఘం చైర్మన్ జ్యోతుల బీముడు పలువురు అధికారులు సచివాలయం సిబ్బంది నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ గొల్లప్రోలు ఎస్సై బాలాజీ తదితరులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు తదుపరి కళ్యాణ్ మండపము ప్రాంగణంలో సీఎం జగన్ సీఎం జగన్ అంటూ కార్యకర్తలు జై జై ద్వానాలు పలికారు రాయవరం రోడ్డు ఎంత వైయస్సార్ శ్రేణులతో కోలాహలంగా అలరించింది.

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

**- వికసిత భారత్ కార్యక్రమంలో ఉజ్వల గ్యాస్ కనెక్షన్ పంపిణి**



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మున్సిపల్ సెంటర్‌లో సోమవారం మద్యాహ్నం మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో వికసిత భారత్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విత్తనాల వెంకటరమణ, తుమ్మల పద్మజ, కరెడ్ల దేవి, చెరుకూరి రవికృష్ణ, అల్లు ప్రసాద్‌లు పాల్గొని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం శ్రీ గంగా హెచ్‌పి గ్యాస్ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ తలాటం గంగాధరరావు ఆధ్వర్యంలో ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లను బిజెపి నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యులు డా.అనూష రాయ్, మున్సిపల్ ఆర్వో వి.చంద్రశేఖరం, స్టేట్ బ్యాంక్ మేనేజర్, మెప్మా సిఎంఎం భ్రమరాంబ, సిఓలు శ్రీదేవి, ఆర్‌పిలు, ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచార రథం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు.

# 4న రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన..

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట పట్టణంలో ఫిబ్రవరి 4వ తేదీన రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు శ్రీకుమార రామ భీమేశ్వర ఎడ్ల పరుగు ప్రదర్శన కమిటీ నాయకులు రామకృష్ణ, కాటూరి రాములు తెలిపారు. సోమవారం ఒక ప్రకటనలో తెలుపుతూ సామర్లకోట - ఉండూరు రోడ్డులోని ఎన్ ఎఫ్ సి ఎల్ రోడ్డులో 4వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రదర్శనను కాకినాడకు చెందిన చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ అధినేత గుణ్ణం చంద్రమౌళి ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా మాజీ మున్సిపల్ చైర్మన్ డా. చందలాడ అనంత పద్మనాభం, ప్రముఖ రైతు చందలాడ పద్మారాజు (బాబ్జి )లు విచ్చేసి పాల్గొంటున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రదర్శనల్లో అవార్డు లు పొందిన ఎడ్ల జతలు ఈ ప్రదర్శనలో పాల్గొంటుండగా జూనియర్, సీనియర్ విభాగాలుగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని కమిటీ నాయకులు తెలిపారు.

# ప్రతీ అర్జీకి నాణ్యతతో కూడిన పరిష్కారం



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన నాణ్యతతో కూడిన పరిష్కరించాలని కె.ఆర్.సి డివిజన్ తహసీల్దార్ డి.సుగుణ అన్నారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో ఆర్డీవో తరపున కె.ఆర్.సి. సబ్ కలెక్టర్ కార్యాలయం, రాజమహేంద్రవరం తహసీల్దార్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డి సుగుణ ప్రజల వచ్చిన పది అర్జీలను స్వీకరించారు. ఈరోజు రెవిన్యూ, విద్యుత్, డిఎం.అండ్.హెచ్.ఓ, మున్సిపల్, ఇరిగేషన్, డ్రైనేజీ పైపులైను వేయవలసిందిగా కోరుట తదితర అంశాలకు సంబంధిచి పదిమంది నుంచి అర్జీలను స్వీకరించామన్నారు. జేకేసి, స్పందన ద్వారా ప్రజాసమస్యల త్వరిత గతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి జిఎల్ఎస్. దేవి, మునిసిపల్ కార్పొరేషన్, డివిజనల్ పంచాయతీ అధికారి, ఐసిడిఎస్ సివిల్ సప్లైస్, బిసి వెల్ఫేర్, ఏపీఎస్‌ఆర్టీసీ, హౌసింగ్, ఇరిగేషన్, ఆర్.డబ్ల్యూఎస్, ఫైర్, సాంఘిక సంక్షేమ, వైద్య, ఆరోగ్య, లేబర్, పశుసంవర్ధక, పరిశ్రమలు, డాక్టర్ ఎస్సార్ ఆరోగ్యశ్రీ తదితర డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో ముద్దాయికి రెండేళ్ళ జైలు శిక్ష

**కాకినాడ,మేజర్‌న్యూస్ :**హత్యయత్నం కేసులో కాకాడ వెంకటరమణ అనే ముద్దాయికి కాకినాడ 2వ అదనపు సెషన్స్ కోర్టు జడ్జి ఎం.వి.ఎన్. పద్మజ రెండు సంవత్సరాల జైలు శిక్ష మరియు పది వేల రూపాయలు జరిమానా విధించారు. యు.కొత్తపల్లి మండలం, ఎండపల్లి పంచాయతీ తూటూరు గ్రామానికి చెందిన కాకాడ వెంకటరమణ (36)అనే వ్యక్తి కాకినాడ, రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలో నివాసం ఉండే ఒక ఆమెతో సుమారు సంవత్సరం కాలం పాటు సహజీవనంచేసి ఆనంతరం ఆమెను అనుమానంతో వేధిస్తూ ది. 26-10-2022 వ తేదీన ఆమె తన పిల్లల్ని మోటార్ సైకిల్‌పై కాకినాడ రమణయ్యపేట మున్సిపల్ హైస్కూల్లో దింపి తిరిగి తన ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో సదరు కాకడ వెంకటరమణ ఇనుప రాడ్డుతో ఆమెను తలపై బలంగా కొట్టి చంపడానికి ప్రయత్నించిన సంఘటనపై కాకినాడ సర్పవరం పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 382/2022 U/S 307 IPCకేసుగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి ముద్దాయిని అరెస్టు చేయగా కాకినాడ 2వ అడిషనల్ సెషన్స్ కోర్టు జడ్జి ఎం.వి.ఎన్. పద్మజ సాక్షులందరినీ విచారించి నింది తుడిపై నేరం రుజువైనందున నిందితునికి 2సంవత్సరాల జైలు శిక్ష మరియు రూ.10,000లు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు.ప్రాసిక్యూషన్ తరపున కాకినాడ2వ అడిషనల్ సెషన్స్ కోర్టు అడిషనల్ పి.పి.డానియల్ దినకర్ జాన్సన్ వాదించారు. సర్పవరం పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ పిసి-3333 బి.శ్యామలరావు ప్రాసిక్యూషన్ వారికి సహకరించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చూసిన సర్పవరంపోలీసు స్టేషన్ ఇనస్పెక్టర్ వై.ఆర్.కె. శ్రీనివాస్‌ని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

# రాష్ట్రంలో వైసిపి అరాచక పాలన

**- కన్నా లక్ష్మీనారాయణ ర్యాలీపై వైకాపా శ్రేణుల దాడి హేయమైన చర్య**
**- సత్తెనపల్లిలో కన్నా గెలుపు ఖాయం**
**- దొంతు మంగేశ్వరరావు**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో వైసీపీ పాలన అరాచకంగా ఉందని, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో టీడీపీ గెలుపు ఖాయమని, సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ గెలుపు ఖాయమని ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు అన్నారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ నాయకులు, సత్తెనపల్లి నియోజకవర్గ ఇంచార్జి కన్నా లక్ష్మీనారాయణ ర్యాలీపై వైస్సార్సీపీ గుండాలు దాడిని ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. కన్నా ఆధ్వర్యంలో వేలాదిగా ప్రజలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని, ఈ కారణంగా తట్టు కోలేని వైస్సార్సీపీ రౌడీలు ఈ విధంగా దాడి చేయడం హేయమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ఎవరెన్ని దాడులు చేసిన కన్నా జిల్లాను రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన విషయం ప్రజలకు తెలుసు అని, ఎన్ని ఆటంకాలు సృష్టించిన సత్తెనపల్లి లో కన్నా గెలుపు ఖాయం అని, మంత్రి అంబటి రాంబాబు కు డిపాజిట్ కూడా దక్కదని ఈ సందర్భంగా ఆయన తెలియజేసారు.

## జన విజ్ఞానవేదిక రాష్ట్రస్థాయి కళారూపాలపై శిక్షణ



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** సైన్స్ సమాజం కోసమేనని నమ్ముతూ నడుస్తున్న జన విజ్ఞానవేదిక రాష్ట్రస్థాయి కళారూపాల శిక్షణ యాసలపు సూర్యారావు భవనంలో సోమవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా సైన్స్ అంశాలపై శాస్త్రీయ దృక్పదాన్ని పెంచాలనే ఉద్దేశంతో పెంచాలనే ఉద్దేశంతో ఫిబ్రవరి 5 నుండి కళాజాత ప్రారంభమవుతుందని, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు గాదె సుబ్బరెడ్డి ప్రారంభించారు. రాష్ట్ర జాత రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలోను ప్రదర్శనలు నిర్వహిస్తు ందని, కళాశాలల్లో, నివాస ప్రాంతాలలో కేంద్రీకరణగా జాతా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకులు త్రిమూర్తులు రెడ్డి, శ్రీరాములు, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.మంగరాజు, పాల్గొన్నారు.

## కరాటేలో ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతుల అందజేత



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :**జపాన్ షాటోకాన్ కరాటే పిల్లి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆఫీస్ లో విద్యార్థిని విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ సర్టిఫికెట్లు అందజేసారు. ఎల్లో బెల్ట్ సాదించిన విద్యార్థులు జె.నవ్య శ్రీ లక్ష్మీదుర్గ, డి.పూజిత, టి.రఫిల్ జాన్, శ్రీకృష్ణ, ఎన్.విహాస్ సూర్య, జె.వీరదుర్గా శేశాంత్. ఆరెంజ్ బెల్ట్ సాధించిన విద్యార్థులు ఎస్. ఆయేషా, సిహెచ్. జైదీప్, పి. పూజ, ఎల్. వైష్ణవి, ఐ. శాంతి వర్ధిని, పి. వెంకట్ చరణ్. గ్రీన్ బెల్ట్ సాధించిన విద్యార్థులు కె.జాక్విన్, పి.శ్రీరామ్, డి.నరసింహ, కె.లక్ష్మి భవాని, వి.వెంకట కిరణ్ మయి, ఎ.అలేఖ్య, ఎం.నవ్యశ్రీ. బ్లూ బెల్ట్ సాధించిన విద్యార్థులు ఎన్.శ్రీ లక్ష్మి లత. బ్రౌన్ బెల్ట్ సాధించిన విద్యార్థి పి. శ్రీ విద్యా స్వాతి లక్ష్మి దేవి. బ్లాక్ బెల్ట్ సాధించిన విద్యార్థి ఎ. వెంకట కావ్య పదముడు సంవత్సరాలకే బ్లాక్ బెల్ట్ సాధించిన కావ్య శ్రీ వాళ్ల తండ్రి ఎ. గణపతిని, అలాగే గ్రాండ్ ఛాంపియన్ షిప్ స్పారింగ్ లో కప్పులను సాధిస్తున్న ఎన్. శ్రీ లక్ష్మి లత ని మరియూ వల్ల తండ్రి ఎన్. అప్పారావుని గౌరవించి ప్రత్యేకంగా అభినందించారు. మాస్టర్ పిల్లి.అరుణ్ కుమార్, లెక్చరర్ పి. ప్రమోద్, శిక్షకుడు పి. విజయ్ ని అభినందించారు.

# ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి

**- ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌లు**



**పెద్దాపురం రూరల్,మేజర్‌న్యూస్ :** పురపాలక సంఘంలో ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని మున్సిపల్ అధికారులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, రెండవ వైస్‌ఛైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మీలు ఆదేశించారు. సోమవారం పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం మున్సిపల్ కమీషనర్ కె.వి.పద్మావతి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించి, త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కరరావు మాట్లాడుతూ బూస్టర్ వద్ద ఎపి డెయిరీ పాలకేంద్రమునకు కేటాయించిన భవనం, జనరేటర్ నిరూపయోగంగా ఉన్నాయని, ఆ భవనంలో సచివాలయం ఏర్పాటు చేయాలని, గతంలో సూచించడం జరిగిందని, దానిపై వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కోరారు. కౌన్సిలర్ విడదాసరి రాజా మాట్లాడుతూ వార్డులో వర్కులు పూర్తి స్థాయిలో నిర్వహించేలా ఇంజనీరింగ్ అధికారులు శ్రద్ధ వహించాలని ఆయన తెలిపారు. 20వ వార్డు కౌన్సిలర్ ఓబిలిశెట్టి నూకరత్నం మాట్లాడుతూ తన వార్డులో నారాయణ స్కూల్ వద్ద కల్వర్టు పాడై ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే దానిని నిర్మించాలని ఆమె కోరారు. అలాగే సచివాలయల పరిధిలో వలంటీర్లకు డివైస్ ఎందుకు ఏర్పాటు చేయలేదో మున్సిపల్ అధికారులను కౌన్సిలర్లు నిలదీశారు. పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ పెద్దాపురం పట్టణంలో రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని పారిశుద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, దానిలో భాగంగానే డ్రైన్‌లలో పూడికతీత పనులు చేపట్టాలని వారు కోరారు. పలువురు కౌన్సిలర్లు ఆయా వార్డుల సమస్యలపై సమావేశంలో చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ డిఇ ఆదినారాయణరావు, ఆర్వో వి.చంద్రశేఖరం, మున్సిపల్ టిపిఓ చింతా ఫణికుమార్, మున్సిపల్ ఏఇ కృష్ణజీవప్రసాద్, ఎస్సై దావీదురాజు, ఏఇలు కృష్ణ జీవప్రసాద్, సుభాషిణి, గాంధీ, కౌన్సిల్ గుమస్తా (సి1) బత్తుల రవి, తదితరులు పాల్గొన్నారు.

# వాఙ్మయం ఎందరినో ప్రభావితం చేస్తుంది - సామవేదం



కాకినాడ, మేజర్ న్యూస్ : సంగీతం, సాహిత్యంతో కలిసిన రచనలు చేసే వాగ్గేయకారులు ఎందరినో ప్రభావితం చేస్తారని, వారి వాఙ్మయం ద్వారా సమాజానికి జ్ఞానభక్తి వైరాగ్యాలను అందించడంతోపాటు సంపూర్ణమైన భగవత్ తత్వాన్ని పరిచయం చేస్తారని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. సర్పవరం గ్రామంలో వేంచేసియున్న భవాని సమేత శ్రీనీలకంఠేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న శ్రీవాగ్గేయకార మండపంలో మూడు రోజులపాటు నిర్వహించనున్న వాగ్గేయకార వైభవాన్ని జ్యోతిప్రజ్వలన చేసి షణ్ముఖశర్మ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాగ్గేయకార మండపాన్ని చూసి తాను ఎంతో ఆనందించానని, నీలకంఠేశ్వరస్వామి సంగీత స్వరూపుడని ప్రస్తావిస్తూ ఈ ప్రాంగణంలో సప్తఋషులతో పాటు వ్యాస, వాల్మీకి, శంకరాచార్య, బమ్మెర పోతన వంటి మహానుభావుల విగ్రహాలను ఏర్పాటు చేయడం భక్తిభావానికి నిదర్శనమన్నారు. నేటితరం వీరిని దర్శించుకోవడం ద్వారా ఋషుల యొక్క మహిమలతోపాటు అష్టాదశ పురాణాల యొక్క విషయాలను కూడా అవగాహన చేసుకోవడానికి ఎంతో అవకాశం ఉంటుందన్నారు. కాకినాడలో విదుషీమణి పెద్దాడ సూర్యకుమారి వంటి విద్వాంసురాలు ఉండడం నగర ప్రజలకు అదృష్టంగాను, దేశవిదేశాలలో సంగీత సేవ చేసే భాగ్యం ఈమెకు లభించడం వరమన్నారు. త్యాగరాజు వంటి గొప్ప వాగ్గేయకారులను భగవంతునితో సమానంగా తాము భావిస్తామని పలు ఉదాహరణలతో షణ్ముఖశర్మ వివరిస్తున్నపుడు సభలో కరతళాధ్వనులతో భక్తిభావాన్ని చాటుకున్నారు. వాగ్గేయకారుల రచనల ద్వారా అనేక ఉపదేశాలను అందించారని, వారిని నిత్యమూ స్మరించుకోవడం మనందరి కర్తవ్యంగా ప్రస్తావించారు. ఇదే ప్రాంగణంలో నారదకుండం పేరిట ప్రత్యేక కొలనును ఎంతో పవిత్రభావంతో భక్తులు పరిశుభ్రంగా ఉంచుకోవడం పట్ల ఆయన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, ఆధ్యాత్మిక కేంద్రంగా నీలకంఠేశ్వర దేవస్థానం విరాజిల్లుతోందన్నారు. తొలుత పూర్ణకుంభంతో పెద్దాడ సూర్యకుమారి, రామచంద్రరావు దంపతులు సామవేదం షణ్ముఖశర్మకు స్వాగతం పలుకగా అయ్యప్పస్వామి ఆలయ కమిటి కార్యదర్శి గోపాలకృష్ణ, కుచేలరావు, నారాయణరావు, రమణమూర్తి, గోపి, డా॥పరశురామ్‌తో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పర్లోవపేటలో జనసేన 'మేము సిద్ధం'



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ సిటిలో జనసేన పార్టీ పి.ఏ.సి సభ్యులు మరియు కాకినాడ్ సిటి ఇంచార్జ్ ముత్తా శశిధర్ నాయకత్వంలో పర్లోవపేట సమీపంలోని టిడ్కో గృహసముదాయాల వద్ద సోమవారం మేము సిద్ధం అనే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముత్తా శశిధర్ మాట్లాడుతూ ఈమధ్య కాలంలో ప్రజాప్రతినిధులు అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి, కాకినాడ ఎం.ఎల్.ఏ మాట్లాడుతున్న తీరుని మేము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి భీమ్‌లీలో సిద్ధం అంటారు, కాకినాడలో ఎమ్మెల్యే ద్వారంపూడి దమ్ముంటే తన మీద పోటీ చేయి అని ఒకసారి పవన్ కళ్యాణ్ ని, ఇంకోసారి చంద్రబాబు నాయుడిని నామీద పోటీచేయాలని అంటారని, నిజంగా నీకు ధైర్యముంటే వాళ్ళు ఎక్కడ పోటీ చేస్తారో అక్కడికి వెళ్ళి పోటీ చేయాలనీ అహంకారపు మాటలు మానాలని హితవు పలికారు. వచ్చే 60 రోజులలో కాకినాడ సిటిలో జరిగే ఎన్నికలలో ద్వారంపూడిని జనసేన పార్టీ ఓడిస్తుందన్నారు.టిడ్కో బాధితుల సమక్షంలో తాను ప్రశ్నిస్తున్నానని, ఎంతమంది ఇక్కడ నివాసం ఉంటున్నారన్నారు. నిన్న 250 కోట్ల రూపాయలతో విద్యుత్ సబ్‌స్టేషన్ పెట్టామన్నారు మరి అలా అయితే ఇక్కడ ఎన్ని బ్లాకులకు విద్యుత్తు సరఫరానిచ్చారు అని నిలదీశారు. మిమ్మల్ని అధికారంలో కూర్చోపెట్టింది ప్రజలకు సేవ చేస్తారనీ అంతేకానీ ఏవీ చేయకుండా అహంకారంగా మాట్లాడటానికి కాదన్నారు. ఒకేఒక్క మాట చెపుతున్నాం మేమందరం సిద్ధంగా ఉన్నాం కాకినాడ ప్రజలూ, జనసేన శ్రేణులూ , టిడ్కో బాధితులు అందరం మిమ్మల్ని ఓడించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈవేళ చెపుతున్నాం తామందరం ప్రతి ప్రాంతంలోకీ వెళతామనీ మిమ్మల్ని ఓడించడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారో ప్రజలందరికీ తెలియచేయడానికి అనిఅన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర సమ్యుక్త కార్యదర్శి వాసిరెడ్డి శివ, ఉపాధ్యక్షులు అడబాల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి అట్ల సత్యన్నారాయణ, జనసేన నాయకులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీఓ స్పందనకు 9 అర్జీలు



పెద్దాపురం, మేజర్ న్యూస్ : సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 9 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ జె.సీతా రామారావు తెలిపారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివైఇఓ దాట్ల సుభద్ర, ఐసిడిఎస్ సిడిపిఓ జి.ఉష, హౌసింగ్ ఏఇ రవిశంకర్, హెచ్‌డబ్ల్యూఓ విశాలాక్షి, డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, ఆర్డీఓ కార్యాలయ ఏఓ వెంకటలక్ష్మీ, డిటి భానుకుమార్, దయానందరాజు, నారాయణ, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దాపురం సబ్ డివిజన్ కార్యాలయంలో ఎస్పీ వార్షిక తనిఖీలు



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలో 20 శాతం సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను గుర్తించడం జరిగిందని కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. వార్షిక తనికీలలో భాగంగా సోమవారం పెద్దాపురం సబ్ డివిజన్ ఆఫీసును జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో నేరాలకు సంబంధించి మరియు రానున్న ఎన్నికలకు సంబంధించి డిఎస్పీ కార్యాలయానికి రావడం జరిగిందన్నారు. సబ్ డివిజన్ పరిధిలో 1637 పోలింగ్ కేంద్రాల వుండగా అందులో సుమారు 20శాతం సమస్యాత్మకంగా గుర్తించడం జరిగిందన్నారు. గత ఎన్నికలలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో జరిగిన సంఘటనలు ఆధారంగా తీసుకుని ప్రజలు ఎటువంటి భయానికి గురికాకుండా ఓటు హక్కుని వినియోగించుకునేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

# రాష్ట్రంలో కానరాని అభివృద్ధి - ముువ్వా శ్రీనివాస్

**ఎటపాక, మేజర్ న్యూస్ :** జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదని, నవరత్నాల పేరుతో దోచుకోవడం దాచుకోవడం తప్పా ప్రజలకు చేసింది ఏమి లేదని అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి ముువ్వా శ్రీనివాస్ అన్నారు. సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాకలో టీడీపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించడం జరిగింది.

ఈ సమావేశంలో అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి ముువ్వా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అప్పులు తప్పా అభివృద్ధి శున్యం అని, జగన్ పాలనలో అరాచకాలు, అన్యాయలు, భూ కబ్జాలు, హత్యలు, మానభంగాలు తప్పా ఏమి కనిపించడం లేదన్నారు. జగన్ పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ అప్పులో కూరుకు పోయిందని, ఈ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కాదని అప్పుల ప్రదేశ్ అని జగన్ ఆలా తయ్యారు చేసాడని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని రాష్ట్ర ప్రజలకు టీడీపీ అధినేత చంద్రబాబు అభివృద్ధితోపాటు సంక్షేమ పథకాలు అందిస్తే, నవరత్నాల పేరిట ప్రజలను జగన్‌మోహన్ రెడ్డి మోసం చేస్తున్నారన్నారు.

రాష్ట్రంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, టీడీపీ హయాంలో వేసిన రహదారులు, విద్యుత్ దీపాలు తప్పా ఈ ప్రభుత్వంలో ఎక్కడా ఒక రహదారి కానీ, లైట్ కానీ వేసిన పాపాన పోలేదన్నారు. ముఖ్యంగా జిల్లాల విభజన పేరుతో ముంపు మండలాలను అభివృద్ధికి ఆమడ దూరంలో పెట్టారని, ముంపు మండలాల ప్రజలు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 350 కిలోమీటర్లు ప్రయాణం చేయవల్సి వస్తుందని, అదే టీడీపీ



అధికారంలోకి వస్తే ముంపు మండలాలను కలుపుతూ జిల్లాను చేసేవారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యం అని, అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలు అందించిన ఘనత చంద్రబాబుదే అని ఆయన తెలిపారు. జగన్ చేస్తున్న సైకో పాలన ను ప్రజలు చూస్తున్నారని, ప్రజలు ఓటు ద్వారా జగన్‌మోహన్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమని ఆయన అన్నారు. టీడీపీ గెలుపు కోసం ప్రతి ఒక్క కార్యకర్త ఒక సైనికుడిలా పని చేయాలనీ, చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యే వరకు అహర్నిశలు కృషి చెయ్యాలని ఆయన పిలుపునిచ్చారు.

## క్షయరహిత జిల్లాగా తీర్చి దిద్దుదాం

- క్షయ బాధితుల పట్ల వివక్ష వద్దు
- "స్పర్శ అవగాహన పక్షోత్సవాలు" కార్యక్రమాలు
- కలెక్టర్ మాధవీలత




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు క్షయ వ్యాధి నిర్మూలన "స్పర్శ అవగాహన పక్షోత్సవాలు" పై విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. మాధవీలత ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లో "స్పర్శ అవగాహన పక్షోత్సవాలు" గొడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, జిల్లాను క్షయ రహిత జిల్లాగా రూపుదిద్దేందుకు ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చెయ్యలన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి నీ పురస్కరించుకుని జనవరి 30 న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. క్షయ వ్యాధిపై సరైన అవగాహన లేకపోవడం వల్ల వారిని దూరంగా ఉంచడం జరుగుతోందని అన్నారు. ఏ ఏ శాఖలు ఏ విధమైన బాధ్యతలు చేపట్టవలసి ఉంటుందని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయిలో చేపట్టవలసిన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఆమేరకు ప్రచార చేపట్టాలని , సంబంధిత శాఖలు భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, డి ఆర్వో జీ. నరసింహులు, టూరిజం ఆర్డి వి. స్వామీ నాయుడు, కే ఆర్ ఆర్ డి ఏస్టిటి కృష్ణ నాయక్, జిల్లా లెప్రసి అధికారి డా ఎన్. వసుంధర, డి ఎమ్ హెచ్ వో డా కె. వేంకటేశ్వర రావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆక్రమణలను అడ్డుకోవాలంటూ స్పందనలో ఫిర్యాదు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వ స్థలం సర్వే నంబర్ 257 జగ్గయ్య చెరువు ఇళ్ళ స్థలాల కోసం గత 9 ఏళ్లుగా పోరాటం చేస్తున్నా అధికార్లు పట్టించుకోవడం లేదని తాజాగా పారిశుధ్య కార్మికుల కోరుకుంటున్న జగ్గయ్యచేరువును ఆక్రమించేందుకు కొందరు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఆక్రమణలను అడ్డుకొని పారిశుధ్య కార్మికులకు నీడ కల్పించాలనీ కోరుతూ సోమవారం కలెక్టర్ కారాలయం స్పందనలో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కూలీ సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ కేశవరపు అప్పలరాజు, మున్సిపల్ శానటరీ వర్కర్స్ యూనియన్ నాయకులు శాఖ రామకృష్ణ మాట్లాడుతూ స్వంత ఇళ్ళు లేక అద్దె నివాసాల్లో ఇబ్బందులు పడుతున్న పిఠాపురం మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ప్రభుత్వ భూమి జగ్గయ్య చెరువు ప్రాంతంలో పారిశుధ్య కార్మిక లబ్ధిదారులకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని ఇళ్ళ నిర్మాణాలు చేసి ఇవ్వక పోయినా కనీసం స్థలమైన కేటాయిస్తే పాకో, పందిరో వేసుకుని తల దాచుకుంటామని అన్నారు. పేదలకిచ్చే ప్రభుత్వ భూమిని కబ్జాకు ప్రయత్నం చేస్తున్న వారికి ప్రభుత్వ యంత్రాంగం కొమ్ముకాయడం దారుణమన్నారు. ఉదయం లేచిన దగ్గర నుండి మున్సిపాలిటీ పరిధిలో చెత్తా చెదారాన్ని తొలగించి పట్టణ ప్రజలకు ఆరోగ్య వంతమైన వాతావరణాన్ని అందిస్తున్న పారిశుధ్య కార్మికులకు నీడ కల్పించే విషయంలో ఇంత ఉదాశీనత ఎందుకో అని ప్రశ్నించారు.

# ఈనెల 30న నిరసన దీక్షలు

**- పంచాయతీరాజ్ చాంబర్ సర్పంచుల సంఘం**



**అంబాజీపేట, మేజర్ న్యూస్ :** మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30వ తేదీన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఒకరోజు సర్పంచుల నిరసన దీక్ష చేపడుతున్నట్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతి కుమారి సుబ్బారావు ఓ ప్రకటన విడుదల చేసారు. పంచాయతీ రాజ్ చాంబర్ మరియు సర్పంచుల సంఘం అధ్యక్షులు వై.వి.బి. రాజేంద్రప్రసాద్, వానపల్లి లక్ష్మీ ముత్యాలరావుల పిలుపు మేరకు గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య సాధనే లక్ష్యంగా 73, 74 రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243జి 11వ షెడ్యూల్లో పేర్కొన్న 29 అంశాలలోని నిధులు, విధులు, అధికారాలను స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులైన సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పిటిసి, ఎంపీపీ మరియు జిల్లా పరిషత్ చైర్మన్ లకు బదలాయించి గ్రామపంచాయతీ, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులను బలోపేతం చేయాలని అదేవిధంగా సర్పంచులు 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మహాత్మాగాంధీ వర్ధంతి రోజైన జనవరి 30వ తారీకున అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నిరసన దీక్షలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొని సమస్యలు మావి కావు మమ్మల్ని నమ్మి మాకు ఓటేసిన మూడున్నర కోట్ల గ్రామీణ ప్రజలవి అని రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా నిరాహార దీక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేసి నిధులు విధులు అధికారాల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు.

# 31న నన్నయ యూనివర్సిటీ స్నాతకోత్సవం

- విశ్వవిద్యాలయంలో విద్యాపరమైన అతిపెద్ద పండుగ స్నాతకోత్సవం
- ముఖ్యఅతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్
- కలెక్టర్ మాధవీలత



**రాజానగరం, మేజర్ న్యూస్ :** నన్నయ యూనివర్సిటీ 13 , 14 , 15 వ స్నాతకోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటనను అన్ని శాఖలు సమన్వయం చేసుకోవడం ద్వారా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా కే. మాధవీలత పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం గైట్ కళాశాల, నన్నయ్య యూనివర్సిటీ లో అధికారులు, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు, జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, అదనపు ఎస్పీ రాజశేఖర్ తో కలిసి ముందస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సంధర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, తూర్పు గోదావరి జిల్లాలో తొలిసారి రాష్ట్ర గవర్నర్ పర్యటన కొసం రానున్న దృష్ట్యా ప్రోటోకాల్ అనుసరించి అందరూ పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 13, 14 మరియు 15వ స్నాతకోత్సవ వేడుకలు ఈ నెల 31వ మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్నాతకోత్సవానికి సంబంధించిన నన్నయ విశ్వవిద్యాలయంలో 2019-20, 2020-21, 2021-22 విద్యాసంవత్సరానికి చెందిన పిహెచ్.డీ, పీజీ, పీజీ డిప్లొమా, యూజీ అండ్ పీజీ ప్రొఫెషనల్ కోర్సులు పూర్తి చేసిన వారికి పట్టాలు అందిస్తామన్నారు. గవర్నర్ చేతుల మీదుగా పిహెచ్.డి 12, గోల్డ్ మెడల్స్ 12 వారికి మెడల్స్ అందించడం జరుగుతుందన్నారు. గవర్నర్‌కు హెలిప్యాడ్ వద్ద స్వాగతం, అనంతరం నన్నయ్య యూనివర్సిటీ లో స్నాతకోత్సవంలో సభ వేదికకు రావడం జరుగుతుందనీ అన్నారు. ఈ సందర్శన లో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, వైస్ ఛాన్సలర్ కె.పద్మరాజు , జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, అదనపు ఎస్పీ రాజశేఖర్ , టూరిజం ఆర్డి వీ. స్వామీ నాయుడు , ఆర్ అండ్ బి ఈ ఈ ఎస్ బి వి రెడ్డి, వైద్య అధికారులు కే. వేంకటేశ్వర రావు, డా ఎన్. సనత్ కుమారి, యూనివర్సిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 9, 16 తేదీల్లో నిర్వహించే నులిపురుగుల నివారణ (డి వార్మింగ్ డే) విజయవంతం చేయాలి

**- 19 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పక నులిపురుగు నివారణ మందు అందచెయ్యలి..- కలెక్టరు డా.మాధవీలత**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగు నివారణ డి వార్మింగ్ ఎంతో అవసరం అని , ఆదిశగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇతర శాఖలతో సమన్వయం కోసం కార్యాచరణను అమలు చేయాలని జిల్లా కలెక్టరు డా. మాధవీలత పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఫిబ్రవరి 9 ,ఫిబ్రవరి 16 తేదీల్లో నిర్వహించే నులిపురుగుల నివారణ (డి వార్మింగ్ డే) కార్యక్రమంపై వైద్యాధికారులు, అనుబపంధ శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం పోస్టర్ ను విడుదల చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు కె . మాధవీలత మాట్లాడుతూ నులిపురుగు నివారణకు వైద్యాధికారులు, సిబ్బంది కి ప్రజలు, పాఠశాల విద్యార్థులు సహకరించాలన్నారు. ఉపాధ్యాయులు నులిపురుగుల నివారణ , జాతీయ పురుగుల నివారణ దినోత్సవం యొక్క ప్రాముఖ్యతపై విద్యార్థులకు, తల్లితండ్రులకు , సంరక్షకులకు అవగాహన కల్పించాలన్నారు. డివార్మింగ్ మెడిషన్ పంపిణీలో ఎంఈవో, ఎంఆర్పీ ముందుగానే పాఠశాలల విద్యార్థుల జాబితా లను సిద్ధం చేసి ఆయా రోజుల్లో నూరు శాతం హజరయ్యే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వైద్యాధికారులు కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించాలని, డివిజనల్ అభివృద్ధి అధికారులతో పూర్తి స్థాయి సమన్వయం ముఖ్యం అన్నారు. పిల్లలకు డి వార్మింగ్ మాత్రలు పంపిణీ వినియోగం కార్యాచరణ ప్రణాళికను జిల్లావైద్య ఆరోగ్య అధికారి, డీసీ ఆర్బిఎస్ కే లకు తెలియజేయాలనీ అన్నారు. కార్యక్రమంలో భాగంగా నులిపురుగులు నివారణ (డివార్మింగ్ డే) గోడ ప్రతిని కలెక్టరు మాధవీలత వైద్యాధికారులు,ఇతర అధికారులతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, డి ఆర్వో జీ. నరసింహులు, టూరిజం ఆర్డి వి. స్వామీ నాయుడు, కే ఆర్ ఆర్ డి ఏస్టిటి కృష్ణ నాయక్, జిల్లా లెప్రసి అధికారి డా ఎన్. వసుంధర, డి ఎమ్ హెచ్ వో డా కె. వేంకటేశ్వర రావు, డిసి హెచ్ ఎస్ డా ఎమ్. సనత్ కుమారి, డిఎల్డీవో వీణా దేవి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**- ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి**



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో వైయస్సార్ ఆసరా ద్వారా పూర్తిగా రుణ మాఫీ చేశామని, ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం స్వయం సహాయక సంఘ మహిళలను రుణ విముక్తులను చేస్తూ వై.యస్.ఆర్. ఆసరా పథకాన్ని 4 విడతల్లో అమలు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపామని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం ఆత్రేయపురం పేరవరం గ్రామాలలో జరిగిన నాలుగో విడత ఆసరా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళల ఆర్థికస్వావలంబనే లక్ష్యంగా అనేక సంస్కరణలు చేపట్టారని, పెన్షన్ కూడా 3,000 చేసి అవ్వాతాతలకు అండగా నిలిచాం అని, ఇప్పుడు ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా 25 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్న ఘనత మన వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీదే అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండా అన్నపూర్ణ, జడ్పిటిసి బోనం సాయిబాబా, ఎంపీడీవో నాతి బుజ్జి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముదునూరి రామరాజు, రాష్ట్ర ఔట్సోర్సింగ్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముదునూరి రామకృష్ణంరాజు, సర్పంచులు పాల నాగేశ్వరరావు,గాదిరాజు రామకృష్ణంరాజు, వేముల శ్రీనివాస్, ఎంపీటీసీ సరళ ధనలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రతీ అర్జీదారుడు సంతృప్తి చెందేలా సత్వర పరిష్కారాలు

**- కమీషనర్ దినేష్‌కుమార్**



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలో స్పందనలో వచ్చిన ప్రతి అర్జీ క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా సత్వర పరిష్కరించడం జరుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి 22 అర్జీలను స్వీకరించామన్నారు. ఈ సందర్భంగా దినేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చే అర్జీల విషయంలో సత్వర పరిష్కారం కోసం అధికారులు, సిబ్బంది జవాబుదారీ తనం తో కూడి సేవలు అందించాలని ఆదేశించారు. రాజమహేంద్ర వరం కంబాల చెరువు వద్ద రోడ్డుకి అడ్డంగా ఉన్న టిఫిన్ వడ్డీని తొలగించవలసినదిగా కోరుట, వి.ఎల్ పురం నందు సిసి రోడ్డు మరియు డ్రైనేజీ నిర్మాణం మంజూరు చేయవలసిందిగా అభ్యర్ధన, ధవలేశ్వరం గ్రామంలో నిర్మించిన టిడ్కో ఇండ్లు స్వాధీన పరచుకొనుటకు అనుమతించవలసిందిగాఉమామహేశ్వరి మరియు ఇతరులు కోరుట గురించి తదితర అంశాలపై 22 వినతులు స్వీకరించామన్నారు. స్పందన కార్యక్రమంలో మున్సిపల్ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి,సూపర్నెంట్‌ఇంజనీర్ జి. పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## కాట్రావులపల్లి వైసిపి నుంచి 500 మంది టీడీపీలో చేరిక

**పార్టీ కండువాలతో సాదరంగా స్వాగతం జ్యోతుల నెహ్రూ**



**జగ్గంపేట,మేజర్‌న్యూస్ :** జగ్గంపేట మండలం కాట్రావుల పల్లి గ్రామంలో ముసిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి 500 మంది తెలుగుదేశంపార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో జ్యోతుల నెహ్రూ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వివరించి, రాబోయే రోజుల్లో గ్రామానికి చేయవలసిన కార్యక్రమాలు కూడా తెలియపరిచారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దారుణంగా ఉందని రైతు ధాన్యం అమ్ముకోలేని స్థితిలో ఉన్నాడని అన్నారు. అమ్మవడి ఏ విధంగా అమలు చేశాడో వివరించారు. మధ్య నిషేధం అని మాయమాటలు చెప్పి మద్యాన్ని 25 సంవత్సరాలు తాకట్టు పెట్టాడన్నారు. ఈ నియోజకవర్గంలో నాలుగు అంశాల ప్రామాణికంగా రేపు రాబోయే రోజుల్లో నియోజకవర్గం అభివృద్ధి చేస్తానని, విద్యా, వైద్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మౌలిక వసతులు, కల్పిస్తానన్నారు. తెలుగుదేశం పార్టీలోకి ఎవరు వచ్చినా ఆహ్వానిస్తానని ఈ సైకో జగన్ రెడ్డిని రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రి పదవి నుంచి గద్దె దించే వరకు ఈ చేరికలు ఇలాగే కొనసాగుతాయని రేపు రాబోయేది తెలుగుదేశం, జనసేన సంకీర్ణ ప్రభుత్వం ద్వారా ఈ రాష్ట్ర అభివృద్ధి ప్రజలకు సంక్షేమం, యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జీను మణిబాబు, కొత్తకొండబాబు, సుంకర సీతారామయ్య, కంటే రామారావు, అడబాల భాస్కరరావు, సూరంపాలెం బాలు, జోషుల రాంబాబు, జంపన సీతారామచంద్ర వర్మ, వెన్న వీరబాబు, బిక్కిన బాబి, దాపర్తి సీతారామయ్య, సుంక విల్లి రాజు, బద్ది సురేష్, వెలిశెట్టి బుజ్జి,వెలిశెట్టి శ్రీను, పప్పు గణేష్, దమర్ సింగ్ మధు, పోలినాటి ధర్మానందకుమారి, యల్లాటి అమ్మాజీ, గుండుపల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.

## 34 ఆర్టికల్స్ ఉపసంహరించుకోవాలంటూ ఆదేశాలు



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ట్రెజరీ స్ట్రాంగ్ రూం లో ఉన్న వివిధ కార్యాలయాలకు చెందిన 34 ఆర్టికల్స్ ఉపసంహరించు కోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, స్ట్రాంగ్ రూం పర్యవేక్షణ జిల్లా నోడల్ అధికారి ఎన్. తేజ్ భరత్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో సంబంధిత శాఖల అధికారులకు ఆమేరకు జేసీ సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జేసీ ఎన్. తేజ్ భరత్ మాట్లాడుతూ, దీర్ఘ కాలికంగా జిల్లా పరిధిలోని 15 శాఖలకు చెందిన 79 ఆర్టికల్స్ స్ట్రాంగ్ రూం లో ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. ఇప్పటికే ఆయా శాఖలకు సంబంధించిన వివరాలు తెలియ చెయ్యడం జరిగిందన్నారు. మొత్తం 49 ఆర్టికల్స్ ట్రెజరీ స్ట్రాంగ్ రూం నుంచి ఉపసంహరించాల్సి ఉండగా 15 ఆర్టికల్స్ ఆయా శాఖలు ఉపసంహరించుకున్నట్లు తేజ్ భరత్ తెలిపారు. ఇంకా ఇరిగేషన్ 18, పోలీస్ 5 , పంచాయతీ రాజ్ 2 , రెవెన్యూ 6 , ఆర్ అండ్ బి, దేవాదాయ జుడిషియల్ శాఖలకు చెందిన ఇంకా 34 ఆర్టికల్స్ స్ట్రాంగ్ రూం లో ఉన్నాయని తెలిపారు. వాటిని వెంటనే ఉపసంహరించుకోవడం జరగాలన్నారు.